

# మా పెళ్లాల పేరు చెప్పీ...

దొడ్ల రామచంద్రారెడ్డి అనీ... 'డి ఆర్' అంటా పిలుస్తా ఉంటాం అందరం... ఆయనే మా ఇశ్వోదయా ఇస్కూలు, జవహర్ బారతి కాలేజీ కట్టించింది. దోవన పోతా ఉంటే మా ఊరికి చదువులు తీసకొచ్చిన మహానుబావుడని అందరూ దండాలు దస్కాలు పెడతా ఉంటారు కాని సామాన్యంగా దోవన పోతా అవుపించడు. యాణ్ణో మానసా హాలు కాడ వాళ్లింట్లో కూచుని ఉంటాడు కేను కుర్చీలో. పిట్టంత మనిషి. అయినా ఏమి? మా ఇస్కూలినీ మా కాలేజీనీ ఎట్టా డెవలపు చేయాలా అని ఆరాటం పడతా ఉంటాడు ఎప్పుడూ.

'కుమారస్వామా. ఇస్కూలు కట్టి ఇంతకాలం అయ్యింది. ఇప్పటి దాకా కాంపౌండు వాలు కట్టుకోలాకపోయినాం. కొత్త కిలాసురూములు పెట్టుకోలేకపోయినాం. ఇంత పెద్ద ఇస్కూలుకి లైబ్రరీ లేదు దానికొక బిల్డింగు ఏర్పాటు చేయించుకోలేకపోయినాం. యియ్యన్నీ మన ఇస్కూలికి బళ్లేదా?' అన్నాడంట ఆయన ఒక రోజున మా కుమారస్వామి ఐవోరితో.

'ఎందుకు బళ్లేదు సార్. దానికి బాగా డబ్బులవతాయి గదా. యాణ్ణుంచి వస్తాయి' అన్నాడంట మా కుమారస్వామి ఐవోరు అణకవగా.



'ఏమయ్యా. డబ్బులుండే నేను ఇంతింత పెద్ద ఇస్కూలు, ఇంతింత పెద్ద కాలేజీ కట్టించినానా? మంచి పనంటే ఎవురైనా ఇస్తారయ్యా డబ్బు. అడిగి చూద్దాం ఉండు' అనేసి, ఎవర్నో ఒక మంచాయన్ని పట్టుకొని, యిట్టిట్టా సంగతి, ఇస్కూలికి పలానా పలానా కావాల, అందుకు మీరు ఒక చెయ్యి ఎయ్యాల అన్నాడంట.

మా డిఆర్ అంటే మహా మహా మినిస్టర్లనీ, మహా మహా గవర్నర్‌లనీ మా ఇశ్వోదయా కాంపౌండుకు తీసకొచ్చి, వాళ్ల పక్కన కూచుని 'ఏం సార్' అంటే 'ఏం సార్' అని చనువుగా మాట్లాడగలిగే మనిషి.

అట్టాంటోడు ఒక మంచి పనికి డబ్బులడిగితే ఎవురైనా యియ్యకుండా పోతారా? అడిగినాడు అదే చాలు అన్నట్టుగా ఇచ్చేసినారు. దాంతో మా ఇస్కూలికి కొత్త బిల్డింగులు శాంక్షను అయిపోయినాయి.

ఒక పక్క మాకు కిలాసులు జరగతా ఉండగానే ఇంకొక పక్క ఇటుక, ఇసికా, సిమెంటు దిగడం మొదలుబెట్టినాయి. బేల్దార్లు, కూలోళ్లు గలబా గలబాగా పనులు చెయ్యడం మొదలుబెట్టినారు.

గుణాద్రాలు తవ్వి, బేసుమట్టం కట్టి, గోడలు లేచే టయానికి బేల్దార్ల నెంబరు అట్టే ఉందిగానీ కూలోళ్ల నెంబరు తగ్గిపోతా కనిపించింది.... ఏందిరా ఇది కూలోళ్లు ఏమైపోతా ఉన్నారు అని మేము అనుకుంటా ఉంటే ఒక రోజు మా కుమారస్వామి ఐవోరు మా కిలాసులోకి వొచ్చి ఆ ముడిని యిప్పినాడు.

'ఒరే.. ఈ ఇస్కూలు ఎవురిదిరా?' అన్నాడాయన ప్లాను మొదలుబెడతా.

'మనదే సార్' అన్నాము మేము ఏమీ ఎరగక.

'దీనికి మంచి జరిగితే ఎవురికి జరిగినట్టురా?' అన్నాడాయన.

'మనకు జరిగినట్టేగదా' అన్నాము మేము.

'కానీ ఆ మంచిలో మన చెయ్యి కూడా ఉండాలి గదరా. అప్పుడే గదరా తృప్తి' అన్నాడాయన.

మాకు అర్థంగాలా. ఆ మాటే అంటే ఆయన డీటైలుగా మొదలుబెట్టినాడు.

'ఒరే... ఇప్పుడు ఈ ఇస్కూల్లో ఇయ్యాల మీరున్నారు. రేపు చదువు అయిపోయినాక యీణ్ణుంచి కాలేజీకి పోతారు. ఆణ్ణుంచి యూనివర్సిటీలకి పోతారు. ఆ తర్వాత ఉద్యోగాలకి పోతారు. అప్పటికి మీకు వొయసొస్తుంది. పెళ్ళిళ్లవతాయి (మా నవ్వులు) .. అట్టా నవ్వబాకండి... దానికి ఇంకా టయం ఉంది... మీకు పెళ్ళిళ్లవతాయి. మీ అమ్మలు అయ్యలు ఎతికి ఎతికి మావాడు అంతటోడు మావాడు యింతటోడు అని బలే బలే అంద మైన పెళ్లాలని మీకోసం పట్టకొస్తారు. మీ పెళ్లాలు మీతో పాటు మీ ఊరికి అంటే మన కావలికి వచ్చి సాయంత్రం పూట సన్నజాజి పూలని జడల్లో పెట్టుకొని, మీ చిటికెన వేలు పట్టుకొని... ఏమండీ ఏమండీ... మీ ఊరు చూపించరా అని అడగతారు. అడిగిందే తడవుగా మీరు టైలు గట్టి బూట్లు తొడిగి బిర్రుగా టక్కుచేసి మీ పెళ్లాల్ని తీసుకొని స్కూటర్ల మీదో మోటారుసైకిళ్ల మీదో మన ఇస్కూలు దాకా వస్తారు... వొచ్చి'..

'వొచ్చి' అన్నాము మేము టెన్షనుగా.

'చూసినారా? ఇదే మా ఇస్కూలు. ఈణ్ణే మేము పదిదాకా చదివింది అని మీ పెళ్లాలకి గ్రేటుగా చూపిస్తారు. అప్పుడు మీ పెళ్లాలు మీ మొకాల వంక చూసి... అబ్బా.. ఇదేమైనా బోడి గొప్పా.. మేమూ చదివినాము మాఊరి హైస్కూలులో. ఇది ఎవుడైనా చేసే సంబడమే గదా మీ స్పెషాలిటీ ఏంది అంటారు. ఆ దెబ్బకి మీ పరువు గాలికి పోతుంది. అవునా?' అని ఆగినాడాయన.

ఆయన ఆ మాటలు ఏ మాడల్‌లో చెప్పినాడంటే ఆ మత్తులో పడి అప్పటికప్పుడు మాకు పెళ్ళిళ్లయినట్టు, మా పెళ్లాలు మాపక్కన నిలబడి బుజాల మీద చేతులేసి మాట్లాడతా ఉన్నట్టు ఫీలయిపోయి ఆ ఫీలింగులో మా పెళ్లాలు నిజంగానే మా పరువు తీసేసినట్టుగా కూడా అనిపించింది.

'ఇప్పుడెట్ట సార్? అట్టా జరక్కుండా ఉండాలంటే ఏమి చెయ్యాలి సార్' అన్నాము అమాయకంగా.

'అదేగదా నేను చెప్తా ఉండేది. ఇప్పుడు మనం ఈ కొత్త బిల్డింగు కట్టుకుంటా ఉన్నామే, దాని పనిలోకి మీరు కూడా దిగాల. ఇటికల్ని అందించడం, గోడల్ని తడపడం, ఇసిక జారిపోకుండా పారతో ఎత్తిపొయ్యడం... ఇట్టాంటి చిన్న చిన్న పనులు చేసినారనుకో. అప్పుడు మీ పెళ్లాలకి- చూసినారా ఆ కొత్త బిల్డింగు.. దాన్ని కట్టింది ఎవరో తెలుసా? మేమే. ఇటికల్ని మోసింది ఎవురో తెలుసా? మేమే. మావల్లే ఆ బిల్డింగు తయారయ్యింది అని కాలరు ఎగరేసినారనుకో. అది గదరా గ్రేటు. అప్పుడు గదరా తృప్తి' అన్నాడాయన.

'అవును సార్. మీరు చెప్పిన మాట కరెక్టు సార్' అన్నాము మేము ఆ మత్తులో నుంచి యింకా బయటపడక.

'ఇంకేమి. రేపటి నుంచి పనిలోకి దిగండి. మీకు ఎప్పుడు పిరీడు ఖాళీగా ఉంటే

అప్పుడు కొత్త బిల్డింగు కాణ్ణే పని' అని ప్లాను ముగించినాడాయన.

తెలుగు పద్యం స్లో స్లోగా అర్థాలు తాత్పర్యాలతో అర్థమైనట్టు ఆయన ప్లాను స్లో స్లోగా అర్థమయ్యేటప్పటికి మాకు వాచిపోయింది.

ఆయన ప్లాను ప్రకారం 'పెళ్లాల' మోజులో పడి అన్ని సెక్షనుల పిలకాయలు మొదటి రెండు మూడు రోజులు హుషారుగా, నవ్వుకుంటా, మాటలు చెప్పుకుంటా పనులు చేసి నారుగానీ రాను రాను మా అందరికీ యమా అవస్త అయిపోయింది. కష్టానికి ఒళ్లు హూనం, చేతులు కాళ్లు నొప్పులు.

'మావా. నేను రాజుల వొంశంలో పుట్టినానుగదా యిట్టాంటి పనులు చెయ్యొచ్చంటావా మావా?' అన్నాడు కేశవరాజుగారి అబ్బాయి మదుసూదనరాజుగాడు ఒక రోజు ఇటికలు మోసి మోసి ఎర్రంగా అయిపోయిన మొకంతో. వాడికి పని చెయ్యాలని లేదు, నెపం రాజుల మీద పెట్టినాడు.

అప్పటికే బుంగలతో నీళ్లు మోసీ మోసీ కాండూరి మురళీగాడికి మండినట్టుంది 'ఒరే... నువ్వు రాజుల వొంశంలో పుడితే ఏమిరా బొచ్చు. నేను కూడా నిప్పుల్ని కడిగే వొంశంలో పుట్టినానురా. యియ్యాల నీళ్లు మోసే కర్మానికి పడిపోలేదంటరా' అన్నాడు కోపంగా.

దానికి కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడు అందుకొని 'నా పరిస్తితి ఏందిరా? పంట రెడ్లోళ్ల పిల్లోడు మట్టితట్టలు మోస్తా ఉన్నాడంటే మా నానమ్మ మూడు రోజులు నిద్రపోదురా. మామూలుగా మా యింట్లో నా చేత యిటు పుల్ల అటు పెట్టనియ్యర్రా. ఇప్పుడు చూడండి రా. గోర్లలో దూరిన ఇసికని పుల్లలతో తీసుకునే ఖర్మ పట్టిందిరా' అన్నాడు చీపురుపుల్ల తీసుకొని ఆ పని చేస్తా.

వాడి బాదకు నేను కూడా అందుకొని 'ఇంక నేనెవరితో చెప్పుకునేదిరా? గోడల్ని తడిపీ తడిపీ నీళ్లల్లో నానీ నానీ ఆకరికి అన్‌సీజనులో గొడుగులు రిపేరు చేసుకునేవాణ్ణి లాగా తయారయినాను గదరా. రాత్రిళ్లు నిద్రపోయే ముందర కాళ్ల నొప్పులకి చేతుల నొప్పులకి కిరసనాయిలు పూసుకొని పొణుకోవాల్సి వొస్తుందిరా' అన్నాను చుట్టుపక్కల యాడా ఐవోరు లేడనుకొని ఖాయం చేసుకున్నాక ఆ రేకుడబ్బాని తీసి నేలకేసి కొడతా.

అందరం రెస్టుకి తురాయిచెట్ల కిందకెళ్లి కూలబడినాం.

కందుల మాలకొండరావుగాడు మా అందరికీ సర్దిచెప్పడానికి 'మీరు మరీ చిత్రంగా మాట్లాడతా ఉన్నార్రా. కుమారస్వామి ఐవోరు ఆయన పని కోసరంగా మనకు ఈ పని చెప్పినాడంటరా? మన మంచి కోసమే కదా... మన పెళ్లాల దెగ్గిర మన పరువు నిలబెట్టేదానికేగదా నిజ్జంగా ఆలోచించి చూడండ్రా. మన పెళ్లాలతో ఈ బిల్డింగు ముందర నిలబడితే ఆ తృప్తే వేరు. ఆ మాటే వేరురా' అన్నాడు.

'ఒరే. పెళ్లాల మాట ఉత్త బోగసురా. మన చేత పని చేయించి కూలోళ్ల డబ్బులు మిగిలించి డిఆర్ కాడ మెప్పులు పొందడానికే ఐవోరు ఈ పని చేసినాడురా. మీరు రూపాయి ఇస్తే నేను పావలా మిగిల్చినాను, ఈ పావలాతో ఇంకేదైనా మంచి పని చేద్దాము సార్ అనే టైపురా కుమారస్వామి ఐవోరు. ఆయన ట్రాపులో పడి నిండా మునిగినాము గదరా మనమూ' అన్నాను నేను.

'అప్పుడే ఏమైందిరా. రేపో మర్నాడో శ్లాబు బోస్తా ఉన్నారు. అప్పుడు నిజంగానే

మనం అయిపోయినామురా' అన్నాడు మురళీగాడు.

శ్లాబు బోసే రోజొచ్చింది. కూలోళ్ల గోలతోపాటు పిలకాయల అరుపులతో, కేకలతో మా ఇస్కూలు మోగిపోయింది. అందరం కాంక్రీటు తట్టల కాడ, ఇసిక కాడ, శ్లాబు కాడ చేతికి అందిన పని చేస్తా ఉంటే క్లవర్లు నీడన నిలబడి తమాషా చూస్తా ఉన్నారు.

'ఒరే.. ఈడ కూడా చూడండిరా క్లవర్ల డాబు. మనం ఎండల్లో తట్టలు అందిస్తా ఉంటే వాళ్లు నీడన సిమెంటు బస్తాల లెక్కలు రాస్తా కమ్మంగా ఐసులు తింటా ఉన్నార్రా. ఇది మరీ అన్యాలంరా' అన్నాడు కాండూరి మురళీగాడు.

'అయితే మాందిలేరా. వాళ్లకే లాసు. రేపు మనం పెద్దయ్యి ఇళ్లు కట్టుకునేటప్పుడు ఈ ఎక్స్పీరియన్సు మనకి పనికి వొస్తుందిగానీ వాళ్లకు పనికిరాదురా. నీడలో ఉన్నోళ్లని యింతకి అంత చేసి పావలాకి ముప్పావలా చేసి ముంచుతార్రా మేస్త్రీలు. వాళ్లు ఔటురా' అన్నాడు కందుల మాలకొండరావుగాడు.

'అబ్బా. బలే చెప్పినావురా. వాళ్లకి అదేరా శాస్తి' అన్నాను నేను.

'మనం ఇప్పుడొక ఫోటో దిగితే బాగుండునురా. రేపు మన పెళ్లాలు మన మాటని నమ్మకపోతే చూపిచ్చడానికి ఒక ఆదారం ఉండేదిరా' అన్నాడు మురళీగాడు.

'నిజమేరా. బ్లాక్ అండ్ వైటులో తలకాయ దువ్వుకొని, సిమెంటు తట్టలతో దిగితే బలే వస్తుందిరా ఫోటో' అన్నాడు కందుల మాలకొండరావుగాడు.

ఈ లోపల కుమారస్వామి ఐవోరు వొచ్చినాడు మాకాడికి.

చెమటలు కారతా ఉన్న మమ్మల్ని చూసి 'శబాషురా. ఈ వొయసులో ఇది మంచి ఎక్సరసైజురా' అని మెచ్చుకొని పోయినాడు.

పోతా పోతా 'అంతా అయినాక మీ కోసం ఇడ్లీ పొట్లాలు రెడీగా ఉంటాయి. తినేసి అప్పుడు కిలాసుల్లోకి పోండి' అని చెప్పేసి పోయినాడు.

అట్టా కష్టాలు పడి, సింగిల్ ప్లేటు ఇడ్లీలు తిని, ఇటికలు మోసి, తట్టలు మోసి లేని పెళ్లాల కోసరం మేము మా ఇస్కూలు కొత్త బిల్డింగుని పూర్తి చేసినాం.

ఇయ్యాల మా కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడి పెళ్లాం వాడితో పాటు అమెరికాలోని అట్లాంటాలో ఉంది. కాండూరి మురళీగాడి పెళ్లాం వాడితో పాటు లండనులోని షేఫీల్డులో ఉంది. అలనాడు సిమెంటు మోసిన అనుబవంతో సివిలు ఇంజనీరు అయిన కందుల మాలకొండరావుగాడి పెళ్లాం వాడితో పాటు సూరతు, మద్రాసు తిరగతా ఉంది. నిన్న మొన్నటి దాకా బాపట్లలో ఉండి, యియ్యాల హైదరాబాదులో టీచరు పని చేస్తా ఉన్న నా పెళ్లాం ఉత్త పుణ్యానికి ఇంగిలీషు మాట్లాడతా నేను లేటుగా యింటికి పోయినప్పుడల్లా వాటీజ్ దిస్ వంకాయపుల్స్ అంటా ఉంది.

మా పెళ్లాలకి ఏనాడూ మేము కట్టిన కొత్త బిల్డింగుని చూపించలా.

కానీ ఇప్పటికీ అది మా ఇస్కూల్లో నవనవలాడతా అట్టాగే ఉంది. మా తర్వాత వచ్చిన పిలకాయలతో కళకళలాడతానే ఉంది.

ఆ తృప్తి చాలదా?

■